క్లుప్తంగా

వనభోజనాలకు తరలిన గ్రామస్తులు



రాయపర్తి : ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకుంటూ మండలంలోని పెర్కవేడు గ్రామస్తులంతా శుక్రవారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా గ్రామ శివారులోని పంటపొలాల్లో వనభోజనాలను చేసుకొని రోజంతా గడిపారు.

నివాళి



రాయపర్తి : స్వాతంత్ర్య సమరయోధుడు భూక్యా సింగ్యానాయక్ ఇటీవల మృతిచెందాడు. కాగా శుక్రవారం ప్రముఖులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. హైదరాబాద్ బోడుప్పల్ కార్పొరేటర్ భూక్యా సుమన్‌నాయక్, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్, రమేష్, రాములు నాయక్‌లు సింగ్యానాయక్ కుమారులైన భిక్షంనాయక్, విజయ్‌కుమార్‌లను పరామర్శించారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వాలి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా శుక్రవారం వాలి మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోవింద్‌నాయక్, భూక్యా మైబుసింగ్, అమీరోద్దిన్, రాజేందర్, నర్సునాయక్, ప్రవీన్ కుమార్ తిరుపతి, రాములు ఉన్నారు.

పర్వతగిరి : మండలంలోని అనంతారం గ్రామంలో ప్యాక్స్ చైర్మన్ గొర్రె దేవేందర్ సోదరి ఇటీవల మృతి చెందారు. కాగా మాజీ జెడ్పీటీసీలు మేడిశెట్టి రాములు, లూనావత్ పంతులు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు కుమార్ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ను బూర్గుమల్ల గ్రామంలోని అతని స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ తాటి దేవేందర్, అధ్యక్షుడు రతన్, పర్వతగిరి వార్డు సభ్యులు కంటెం ఏకాంతం, విశ్రాంత ఉపాధ్యాయుడు అక్కల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ బస్సు ఢీకొని సైకిలిస్టుకు తీవ్రగాయాలు



క్షతగాత్రుడు వీరు

గీసుకొండ : మండలంలోని వరంగల్-నర్సంపేట రహదారిలో కాలేజీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని హర్జ్యా తండాకు చెందిన ఆంగోత్ వీరు శుక్రవారం మచ్చాపూర్‌కు సైకిల్‌పై వెళ్లి పని ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా వరంగల్ వైపు నుంచి నర్సంపేటకు విద్యార్థులను తీసుకుని వెళ్తున్న బిట్స్ కళాశాల బస్సు అతడిని వెనకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరు కాలు విరిగి, పలు చోట్ల గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కాలేజీ యాజమాన్యం అవసరమైన చికిత్సలు చేయిస్తామని గాయపడ్డ వీరు బంధువులకు హామీ ఇచ్చి అతడిని వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది. కాగా మచ్చాపూర్ నుంచి కొమ్మాల వరకు పలుమార్లు కాలేజీ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో గతంలో కొందరు మృతి చెంది, గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

శాయంపేట : ఇళ్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసె వాసులకు పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక శివారులో సర్వేనంబర్ 633లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఆక్రమణకు గురైన అసైన్డ్ భూములను భూ బకాసురులు నుంచి కాపాడి పేద ప్రజలకు పంచిస్తామని ఎర్రజెండా సాక్షిగా తెలిపారు. 633 సర్వేనెంబర్ శ్రీవెంకటేశ్వర స్టోన్ క్రషర్ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందని, కాని అభిప్రాయ సేకరణ ప్రజలకు తెలియకుండానే అయిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పర్యావరణానికి సంబంధించిన అనుమతుల విషయం గురించి కేవలం 25మంది అనుచరులతో మాత్రమే అభిప్రాయం తీసుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

ఆటలు ఆడుకునేదెలా?



నల్లబెల్లి చెరువులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం



ముమ్మడివరంలో చెరువు కట్ట కింద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు

- అనువుగాని చోట క్రీడా ప్రాంగణాలు
- పేరుకే ఎకరం స్థలం కేటాయింపు
- పలు చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లోనే..

సంగెం : చెరువు కట్ట.. ఎస్సారెస్పీ కాల్వ గట్టు.. ప్రభుత్వ పాఠశాలల మైదానాలు.. ఎత్తుపల్లాలు.. బండరాళ్లు ఇవే తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు.. క్రీడా మైదానాలు ఇలా ఉంటే ఆటలు ఆడేదెలా అంటూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా పోటీలు, శిక్షణకు అనువైన ఎకరం ప్రభుత్వ స్థలాన్ని పల్లె క్రీడా ప్రాంగణం కోసం గుర్తించాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ల పర్యవేక్షణలో సర్వేయర్లు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి 33జీపీలు, శివారు గ్రామాలు, తండాల్లో మొత్తం 44ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ముందుగా జీపీకి ఒకటి చొప్పున పూర్తి చేయాలని పనులు ప్రారంభించారు. వీటిలో కేవలం 32 జీపీలు, 2శివారు గ్రామాల్లో మొత్తం 29 పూర్తికాగా 5 పురోగతిలో ఉన్నట్లు ఈజీఎస్ ఈసీ గణేష్ తెలిపారు.

క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాల కొరత..

ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఆట స్థలాల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో 13, ఎస్సారెస్పీ కెనాల్ గట్టు పక్కన 5, మిగిలిన చెరువు, చెరువు కట్ట కింద తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

ఏర్పాటు చేసినవి అనువుగా లేవు..

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చాల వరకు అనువుగా లేవనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.. కొన్ని గ్రామాల్లో బండరాళ్లు, ఎత్తుపల్లాలు, ఎస్సారెస్పీ కెనాల్ కట్ట, ఊరికి చాలా దూరంగా ఇలా అనువుగాని ఆటస్థలాలు ఏర్పాటు చేయడం వల్ల యువత ఆటలు ఆడేందుకు వెళ్లకపోవడంతో నిరుపయోగంగా మారాయని ఆరోపిస్తున్నారు. నల్లబెల్లి ఆటస్థలం చెరువులో, ముమ్మడివరంలో చెరువు కట్ట కింద మనుషులు వెళ్లలేని చోట ఏర్పాటు చేశారు. కుంటపల్లి, తీగరాజుపల్లి, గాంధీనగర్, కొత్తగూడెం, సోమ్లాతండా గ్రామాలలో ఎస్సారెస్పీ కెనాల్ గట్టు పక్కన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి అందులో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేశారు. మరి కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయకపోవడంతో పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి ప్రతిభవంతులైన క్రీడాకారులను తయారు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుకూలమైన స్థలం లేకనే..



భూముల లభ్యతను బట్టి తెలంగాణ ఆటస్థలాలను ఏర్పాటు చేశాం. అనుకూలమైన స్థలం లేనందునే ఇటు విద్యార్థులను, యువతను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశాం. పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కాకుండా ఉదయం, సాయంత్రం క్రీడాకారులు ఆడుకోవాలి. మిగిలిన వాటిలో అసంపూర్తిగా ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయిస్తాం.

-వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ, సంగెం

ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారు

ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి



జోడో యాత్రలో భాగంగా వర్షపు నీటిలో నుంచి వెళ్తున్న దొంతి మాధవరెడ్డి తదితరులు

నెక్కొండ : ప్రజాధనాన్ని దోపిడీ చేస్తూ.. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడాలని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని దీక్షకుంట, ముదిగొండ, హరిచంద్రు తండా పంచాయతీలల్లో గురువారం రాత్రి ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వర్షం కురుస్తున్నప్పటికి దొంతి యాత్ర కొనసాగించగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనగా.. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ.. రాజీవ్‌గాంధీ సందేశాన్ని తెలియజేశారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క పేదోడు సంతోషంగా లేరన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టవని, ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లలో రైతులు ఏ విధంగా ఇబ్బందులు పడ్డారో ప్రజలకు తెలుసని ఆయన పేర్కొన్నారు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ, రైతు బంధు ఎకరాలకు రూ.15 వేలకు పెంచడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కింద అర్హులకు రూ.5లక్షలు అందజేస్తామన్నారు. మహిళలకు రూ.500లకే గ్యాస్ అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు నూతనోత్సహంలో ముందుకు సాగుతూ.. పార్టీ బలోపేతానికి పాటుపడాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, దూదిమెట్ల మల్లిక్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నాయకులు గై లక్ష్మణ్, రాచకొండ రఘు, బండి శివకుమార్, లావుడ్యా తిరుమల్, జాటోత్ భిక్షపతి, చెన్నూరు కిరణ్‌రెడ్డి, చార్ల శివారెడ్డి, రావుల అజయ్‌కుమార్, పులి నవీన్, అనుముల శ్రీధర్‌రెడ్డి, రాంబాబు, చీర కిరణ్, జక్కుల రాజు, కోల వెంకన్న, మట్ట భిక్షపతి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'జేఏసీ ఏర్పాటు కాకుండా కుట్ర'



రాజీనామా చేసిన శ్రీనివాస్

నర్సంపేట : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక పక్క ఎనిమిది మెజార్టీ యూనియన్ల నాయకులు పూర్తిస్థాయి జేఏసీ ఏర్పాటు కోసం కృషి చేస్తుంటే ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి దానికి అడ్డుపడుతున్నాడని ఎంప్లాయిస్ యూనియన్ నర్సంపేట డిపో ఈయూ ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం కాకుండా రాజిరెడ్డి కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నందుకు శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్‌కు రాజీనామా చేస్తున్నట్లు శ్రీనివాస్ ప్రకటించారు. ఆర్టీసీలో మొత్తం 11యూనియన్లు ఉంటే కేవలం రెండు యూనియన్లను కలుపుకొని జేఏసీ చైర్మన్‌గా కొనసాగడం ఎలా చెల్లుబాటు అవుతుందని ప్రశ్నించారు. పూర్తిస్థాయి జేఏసీ ఏర్పాటు అయ్యేంత వరకు ఏ యూనియన్‌లో చేరబోనని అన్నారు.

అభివృద్ధికి చేయూత

గీసుకొండ : మండలంలోని శాయంపేటహవేలిలో నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పలు పనులు చేపట్టేందుకు డాక్టర్ మునిగాల సురేందర్‌రావు, మాడిశెట్టి రాజేందర్ ముందుకు వచ్చారు. శుక్రవారం ఆలయం వద్ద నిర్మాణాలు చేపట్టడానికి రూ.లక్ష విలువైన మొరం పోసి చదును చేసే పనులను చేపట్టారు. గ్రామస్తులు సముద్రాల యాకస్వామి, అర్చకులు పాల్గొన్నారు.

ఎక్కడి గురుకులం అక్కడే!



ఖానాపురం మండలం ఐనపల్లిలో కొనసాగుతున్న నెక్కొండ మండల గురుకుల పాఠశాల

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం..
- ఐనపల్లిలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం
- నెక్కొండకు మార్చాలని డిమాండ్

నెక్కొండ : గురుకుల విద్యా సంస్థల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధన తీసుకొచ్చింది. విద్యా సంస్థల మంజూరు సమయంలో నిర్దేశించిన స్థలంలోనే పాఠశాలను కొనసాగించాలని పేర్కొంది. గతంలో విద్యా సంస్థల నిర్వహణ విషయంలో ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించినప్పటికీ.. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) దృష్టి సారించాల్సి ఉంది. ఏ మండలానికి చెందిన గురుకులాలు అక్కడే కొనసాగించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఖానాపురం మండలం ఐనపల్లిలో కొనసాగుతున్న నెక్కొండ మండల గురుకులం వెలుగులోకి వచ్చింది. ఐదేళ్ల క్రితం మండలానికి మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల మంజూరైంది. ఒక సంవత్సరం అరకొర వసతుల మధ్య పాఠశాల కొనసాగింది. విద్యార్థులకు వసతితోపాటు సరైన తరగతి గదులు లేక పోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలో పక్కా భవనం నిర్మించి అన్ని వసతులు కల్పించాలని అప్పటి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగారు. దీంతో వారి డిమాండ్లు పక్కకు పెట్టిన స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేయడంతోపాటు వసతి సౌకర్యం లేదన్న కారణం చూపి, దాన్ని ఐనపల్లిలో ఏర్పాటు చేశారు. అక్కడ పదోతరగతి చదివిన విద్యార్థులు పరీక్షలకు మాత్రం ఏటా దాదాపు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి నెక్కొండ మండల కేంద్రంలోనే రాయడానికి వస్తున్నారు. విద్యార్థుల పరీక్షలకు కాకుండా ఇతర వాటి విషయంలో సైతం చాలా సాంకేతిక ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పాటు విద్యార్థుల చేరికలు తదితర అంశాలు ముఖ్యమైనవి. ఇలాంటి సందర్భంలో గురుకుల పాఠశాల నెక్కొండ మండలంలో కాకుండా మరో మండలంలోని ఇతర ప్రాంతంలో ఉండటంతో ఇబ్బందులు అనేకం. ఈ పాఠశాలను ఎలాగైన మంజూరైన మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఏడాది ఏదో ఒక సాకుతో మాట దాట వేస్తున్నారన్న అపవాదు ఉంది. తాజాగా ఆదేశాలు అందినప్పటికీ స్థలం లభ్యత కోసం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునారన్నా విమర్శలు వినవస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 375 గురుకుల పాఠశాలలు వేరే చోటనే కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించి వాటిని మంజూరైన ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని తాజా ఆదేశాలతో మండలానికి మంజూరైన గురుకుల పాఠశాల వస్తుందన్న సంతోషంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.

మరో చోటుంటే ఇబ్బందులే..



మంజూరైన దగ్గర కాకుండా మరో చోటుంటే విద్యార్థులకు ఇబ్బందే. నెక్కొండకు మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు వసతుల లేమి కారణంగానే మరో చోటుకు తరలించారు. ప్రస్తుతం ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలను నెక్కొండకు మార్చాల్సి ఉంది. కానీ ఇక్కడ సరైన వసతుల కోసం అన్వేషిస్తున్నాం. నివేదికను జిల్లా అధికారులకు, విద్యా సంస్థ సొసైటీకి నివేదిస్తాం.

-రత్నమాల, ఎంఈఓ, నెక్కొండ

రైతు కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ప్రమాదవశాత్తు మృతి చెందిన 26మంది రైతు కుటుంబాలకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.కోటి 30లక్షల విలువైన రైతుబీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన రైతు బీమా పథకం వల్ల యావత్ తెలంగాణ రైతులు భరోసాగా బతుకుతున్నారన్నారు. రైతు ఏదైన కారణం చేత సహజ, ప్రమాదవశాత్తు మృతి చెందితే రైతు కుటుంబం దిక్కులేనిది కావొద్దని తెలంగాణ ప్రభుత్వం ఖజానా నుంచి ప్రీమియం చెల్లించి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌తో అగ్రిమెంట్ చేసుకుని మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.5లక్షల బీమా సొమ్మును బాధిత కుటుంబానికి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆర్ఎస్ఎస్ డైరెక్టర్లు, రైతుబంధు కమిటీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వ్యవసాయశాఖ అధికారులు, ఏఓలు, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తోంది

మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పాలన నడుపుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటూ గొప్పలు చెప్పుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సమయంలో ఆత్మహత్య చేసుకున్న అమరుల ఆత్మ ఘోషిస్తోందని అన్నారు. స్వయం పాలనకు విరుద్ధంగా కుటుంబ పాలన నడుస్తోందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు ఎత్తును తగ్గించి మహారాష్ట్రకు దోచి పెట్టడం జరుగుతుందని, అదే విధంగా కాళేశ్వరం సుందిళ్ల వాగు మేడిగడ్డ అని పేరు పెట్టుకుని రూ.5లక్షల కోట్లు అప్పుచేసి ఈ రాష్ట్ర వనరులను నీటి పేరుతో మెగా కన్‌స్ట్రక్షన్‌కు దోచిపెట్టారన్నారు. ప్రభుత్వం తప్పిదం వల్ల పబ్లిక్ సర్వీస్ పరీక్షల్లో జరిగిన అవకతవకల వల్ల 34లక్షల మంది నిరుద్యోగ యువత కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినడానికి కారణం కాదా అని ప్రశ్నించారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున మళ్లీ పోటీ చేస్తానని, తనను ప్రజలు ఆశీర్వదించి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి నర్సింహరాములు, బాల్నె జగన్, కొంపెల్లి రాజేందర్, పంజాల రాము, చిలువేరు రజనిభారతి, చిలువేరు రమేష్, కన్వీనర్ మనీష్‌గౌడ్, గూడూరు సందీప్, ఠాకూర్ విజయ్‌సింగ్, కూనమల్ల పృథ్వీరాజ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, సామాజిక భద్రతపై అవగాహన

మామునూరు : గ్రామీణ ప్రాంత మహిళలు సైబర్ నేరాలు, సామాజిక భద్రతపై అవగాహన పెంచుకోవాలని ఐఎస్ఏసీ వింగ్ రిటైర్డ్ కమాండర్ శ్రీనివాస్, ఎల్.క్యూబ్ సొల్యూషన్ ఫౌండర్ రమ పట్నాయక్ సూచించారు. ఈమేరకు శుక్రవారం ఖిలా వరంగల్ మండలం వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జీ20, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ వారి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, సమాచార భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. సెల్‌ఫోన్స్, లాప్ టాప్స్‌లో ఇంటర్నెట్ వాడకం ఎక్కువైందని అపరిమితంగా, అజాగ్రత్తగా వాడుతున్న వారేఎక్కువగా సైబర్ క్రైమ్ బారీన పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంత మహిళలు, విద్యార్థినులు తమ వివరాలను గోప్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్స్‌కి లాటరీ, కూపన్స్ వచ్చాయని, ఓలెక్స్ వాహనాలు అమ్ముతామని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైన వెంటనే టోల్ ఫ్రీ నంబర్–155260 సంప్రదించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు, హెడ్స్ సత్యవతి, తన్వీర్ జహన్, అయేషా బాను, పున్నేలు సర్పంచ్ దేవేందర్‌గౌడ్, బ్యాంక్ అధికారులు అనిల్, ప్రశాంత్, అధ్యాపకులు ఆశ వర్కర్లు, రమణ కుమార్, కిరణ్‌కుమార్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై బండారి రాజు

రాయపర్తి : మండలకేంద్రంలోని గుబ్బెడిబోడుకింది తండాకు చెందిన గుగులోత్ హుస్సేన్ ఇరవై రోజుల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. కాగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హుస్సేన్‌కు తన అప్పగించినట్లు ఎస్సై బండారి రాజు తెలిపారు. ఇరవై రోజులక్రితం హుస్సేన్ ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్.జీఓవీ.ఇన్ ద్వారా మొబైల్‌ను గుర్తించి అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

వితంతు వ్యవస్థను నిర్మూలిద్దాం..



వర్ధన్నపేట: కట్య్రాలలో నిర్వహించిన ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ సంపత్‌రెడ్డి

దుగ్గొండి : వితంతు వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలవికాస ప్రోగ్రాం ఆఫీసర్ బుర్ర వినయ్ తెలిపారు. అంతర్జాతీయ వితంతు దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వెంకటాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భర్త చనిపోయిన వారిని పెళ్లిళ్లు, శుభ కార్యాలకు దూరం పెట్టడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఊరటి మహిపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి, హెచ్‌ఎం సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని కట్య్రాలలో శుక్రవారం బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవాన్ని సర్పంచ్ గుజ్జ సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మూఢాచారాలకు దూరంగా ఉంటూ వితంతువులను గౌరవించాలని ర్యాలీలో అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్పంచ్ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. వితంతువులను వివక్షకు గురి కాకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలన్నారు. మూఢాచారాల పేరిట వితంతువులు ఎంతో మానసిక క్షోభకు గురి అవుతున్నారని వారిని మూఢాచారాలకు దూరంగా ఉంచి వారిని గౌరవించాలన్నారు. లింగ సమానత్వంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధి రాణి, మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



దుగ్గొండి: ర్యాలీ నిర్వహిస్తున్న బాధ్యులు



రాయపర్తి: రాగన్నగూడెంలో మానవహారం

వితంతువుల దినోత్సవం

రాయపర్తి : అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని రాగన్నగూడెంలో మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వితంతువులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ రెంటాల గోవర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు కృష్ణారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



వర్ధన్నపేట : మండలంలోని కడారిగూడెంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ అర్షనపెల్లి శ్రీరాంభూపాల్ బీజేపీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏక్ దేశ్‌మే దో నిషాన్.. దో విధాన్.. దో ప్రధాన్ నహీ చలే'గా అనే నినాదంతో కశ్మీర్ భారత్‌లోని అంతర్భాగమని నిరంతర పోరాటం చేసి అమరుడైన శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని నరేంద్రమోదీ కార్యదక్షతతో ఆర్టికల్ 370 అమలు చేశారన్నారు. నాయకులు జడ సతీష్, పంజా వెంకటేశ్వర్లు, కుందూరు మహేందర్‌రెడ్డి, పింగిళి సంపత్‌రెడ్డి, పింగిళి రాజేందర్‌రెడ్డి, వంగాల రాజేందర్‌రెడ్డి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.